
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

పల్నాడు జిల్లా వార్తలు

శుక్రవారం 13 డిసెంబరు 2024

డాగ్.. డయాబెటిస్

- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు

8





- రిజిస్ట్రేషన్ చార్జీలో భారీ మినహాయింపు
- పన్నుల్లో రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం
- చార్జింగ్ స్టేషన్ల పెట్టుబడిలో 25 శాతం రాయితీ
- విద్యుత్ రవాణా పాలసీ 4.0తో పండుగే పండుగ

ఇక ఈవీల హవా

విద్యుత్ వాహనాలకు వరాలు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రవాణా పాలసీని ప్రకటించింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు విద్యుత్ వాహనాల వినియోగంపై ఆసక్తి చూపు తున్నారు. ఈవీ వాహనాలు ధర అధికంగా ఉన్నా పర్యావరణం, పెట్రోలు ధరల భారంతో పలువురు ఈవీ వాహనాలను పెద్దసంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ప్రకటించింది. విద్యుత్ వాహనాల వినియోగదారులు, చార్జింగ్ స్టేషన్ నిర్వాహకులకు ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీంతో విద్యుత్ వాహనదారులకు పండుగే.. పండుగని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం వెనుకంజలో ఉండటంతో వాటిని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రూపొందించిన విద్యుత్ రవాణా పాలసీ ద్వారా 2029 నాటికి 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10 వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఔత్సాహిక ఎంఎస్ ఎంఈ పెట్టుబడిదారులకు పెట్టుబడిలో 35 శాతం రాయితీ, ఇంటెన్సివ్‌లు ప్రకటించింది. క్వాలిటీ సర్టిఫికేషన్, విద్యుత్ సుంకం కూడా రీయింబర్స్ చేస్తారు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఒ క్కో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌కు పెట్టుబడిలో 25 శాతం సబ్సిడీ, గరిష్ఠంగా 3 లక్షలు ఇస్తారు.

● వినియోగదారులకూ రాయితీ..

విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వినియోగదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలో మినహాయింపు ఇచ్చింది. 12 శాతంగా ఉన్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయిస్తోంది. అంటే రూ.లక్ష వాహనానికి రూ.12 వేలు లైఫ్ టాక్స్ మినహాయింపు వస్తుంది. దీంతో పాటు వాహన ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కార్లకు మాత్రం ఇది వర్తించదని సమాచారం. రూ.లక్ష లోపు ఉన్న ఈ-ద్విచక్ర వాహనాలకు, రూ.2 లక్షల లోపు ధర ఉన్న ఈ-3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ-రవాణా వాహనాలకు, రూ.8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ.2 కోట్ల లోపు ధర ఉన్న ఈ-బస్సులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. అమ్మకందారులకు కూడా పది శాతం రాయితీ ప్రకటించారు.

● ప్రతి 30 కి.మీ.కి ఒక చార్జింగ్ స్టేషన్

ప్రధాన రహదారుల్లో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం పాలసీ లక్ష్యం. నగరాల్లో 3 బై 3 కేఎం గ్రిడ్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మొబిలిటీ సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కార్పస్ ఫండ్‌గా కేటాయించింది. ఈ మొబిలిటీ స్టార్టప్‌ల కోసం 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది.


మందులు ఏటిపాలు

ప్రాణాపాయ మందులు.. రోగుల నీరసం పోగొట్టే బలం సిరప్‌లు.. వివిధ రోగాలకు సంబంధించిన ట్యాబ్లెట్లు.. జగనన్న ఆరోగ్య సురక్ష, కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లు.. ఏటిపాలు చేశారు. ప్రైవేటు దోపిడీని తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పేదలకు ఇవ్వాల్సిన మందులు నదిలో పారేశారు. పేదల కోసం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన మందుల్లో చాలావరకు చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్నాయి. రోగులకు ఇవ్వడానికి చేతులు రాదు కానీ ఇలా పారేయడం ఏమిటని ఆ మందుల గుట్టలను చూసిన పలువురు విస్తుపోతున్నారు. బయోవ్యర్థాల కింద అప్పగిస్తే దొరికి పోతామనుకున్నారో! లేక నదిలో పారేస్తే ప్రవాహంలో కొట్టుకు పోతాయనుకున్నారో కానీ, పెద్దగుట్ట మందులను కృష్ణానదిలో వేశారు. ఈ మందుల గుట్టలపై ప్రశ్నిస్తే ఆస్పత్రులు, 104 సిబ్బంది మావికాదంటే మావికాదంటూ చెప్తూ కృష్ణాజిల్లా వారు పారేసి ఉంటారని నెపం మోపుతున్నారు. ఈ మందుల్లో కొన్ని గడువు తీరిపోగా.. మరికొన్ని 2025 వరకు గడువు ఉన్నాయి. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలోనే మందులకు నిప్పు పెట్టగా తాజాగా నది మధ్యలో గుట్టలు గుట్టలుగా విలువైన ఔషధాలు దర్శనమివ్వడంపై ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

- 2025 వరకు గడువున్నా పారేశారు
- కృష్ణానదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు
- వైసీపీ హయాంలో ఓ తంతుగా ఆరోగ్య శిబిరాలు.. మందులన్నీ వృథా
- పేద రోగులకు ఇవ్వకుండా పారేయడంపై విమర్శలు
- గడువు ముగిసే సమయంలో కొనుగోలుపై అనుమానాలు
- మావికాదంటే.. మావికాదంటున్న పీహెచ్‌సీ, 104 సిబ్బంది

తెనాలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి ఔషధ కంపెనీల దగ్గర కొని ప్రభుత్వం అందించిన మందులవి. 104లో అందించాల్సినవో! లేక పీహెచ్‌సీల నిర్వాకమో కానీ, కొన్ని గడువు తీరాక.. మరికొన్ని 2025 వరకు గడువున్నా కృష్ణానదిలో పారేశారు. వాటితోపాటే జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, గుండె సంబంధ మందులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు వంటివి కూడా ఆ చెత్త గుట్టలో ఉన్నాయి. కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్ కోసం నదిలోకి గాలు వేసి ఉంది. ఆ గాలు మార్గంలోని చెత్త కుప్పల్లో ఈ మందులు కూడా ఉన్నాయి. 2024 మేతో గడువు ముగిసిన మందులు ఎక్కువగా ఉంటే, 2025 వరకు గడువున్న మందులు కూడా ఆ గుట్టలో ఉన్నాయి. కొల్లిపర, మున్నంగి ప్రభుత్వ వైద్యశాల సిబ్బందితో పాటు 104 వాహన సిబ్బంది మావి కాదంటే మావికాదంటున్నారు. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గడువు ముగిసిన మందులను ఆస్పత్రి ఆవరణలోనే నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కృష్ణానదిలో వివిధ రకాల మందులు ప్రత్యక్షం కావడం చూస్తే గత ప్రభుత్వ హయాంలో పేదల వైద్యంపై ఎంతవరకు శ్రద్ధ చూపారనేందుకు నిదర్శనంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే రోగులకు మందులు ఇస్తే వారి ఆరోగ్యం కుదుటపడటంతోపాటు, ఆర్థికపరంగా కూడా వెసులుబాటు ఉంటుంది. కానీ కొన్ని వైద్యశాలల్లో వైద్యులే పేద రోగులకు ప్రైవేటు దుకాణాల్లో మందులు తెచ్చుకోవాలని రాస్తున్నారు. వివిధ రకాల రక్త పరీక్షల కేంద్రాలకు కూడా పంపిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులు, పరీక్షల కిట్లను మాత్రం ఇలా పారేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శిబిరాలు ఓ తంతుగా మారడంతో విలువైన మందులన్నీ వృథాగా మారాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం సరఫరా చేసే మందుల్లో ఏదో ఒకటి, రెండు రకాల

(మిగతా 6వ పేజీలో)






మున్నంగి ఇసుక రీచ్ మార్గంలో కృష్ణానది మధ్యలో పారేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, వివిధ రకాల మందులు

సమీక్షలు... ఆదేశాలు

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో కీలక నిర్ణయాలు
- అనేక అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- గోదావరి జలాల ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కదలిక
- పల్నాడులో 466 ఎకరాల భూసేకరణకు చంద్రబాబు ఆదేశాలు
- గుంటూరు యూజీడీ పెండింగ్ నిధుల విడుదలకు నిర్ణయం
- ఏఐబీ పనుల కొనసాగింపుపై నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి
- కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళికల రూపకల్పనపై నిర్ణయం



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి గతంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం



సదస్సులో పాల్గొన్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వివిధ అంశాలపై సమీక్షలు.. ఆదేశాలు.. సూచనలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు.. ఇదీ రాజధాని సచివాలయంలో గురువారం జరిగిన కలెక్టర్ల రెండు రోజు సదస్సు జరిగిన తీరు. నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు తీపి కబురు చెప్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో గోదావరి జలాల ఎత్తిపోతల పథకంపై నిర్ణయం తీసుకున్నారు. పైగా ఈ పథకాన్ని 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని ప్రకటించారు. రెండో రోజు సదస్సులో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు, బాపట్ల కలెక్టర్ వెంకటమురళిలు ఆయా జిల్లాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రికి నివేదించగా, వాటిపై ప్రత్యేకంగా చర్చించారు. గుంటూరు నగరానికి సంబంధించి గతంలో ఆగిపోయిన యూజీడీకి పెండింగ్ నిధులు మంజూరుకు సీఎం ఆమోదం తెలపగా నగరపాలక సంస్థలో ఏఐబీ ప నుల కొనసాగింపుపై కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు ప్రత్యేకంగా నివేదించారు. స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లపై విస్తృతంగా చర్చ జరగడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అది సాకారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నాటి కలెక్టర్ల సదస్సులో గోదా వరి - పెన్నా నదుల అనుసంధానంపై ప్రధానంగా చర్చ జరిగింది. సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాల తరలింపు పథకానికి భూసేకరణకు కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ఎత్తిపోతల పథకం పనులకు త్వరలో కదలిక రానున్నది. ఎత్తిపోతలకు సంబంధించిన రెండు పంపుహౌస్‌ల పనులు పురోగతిలో ఉండగా మరో మూడు పంపుహౌస్‌ల పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇక గుంటూరుకు సంబంధించి యూజీడీ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు నివేదించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్కీమ్ మంజూరు కాగా దాదాపుగా రూ.500 కోట్లు ఖర్చు చేశామని అయితే రాష్ట్ర ప్రభుత్వ, నగరపాలకసంస్థ వాటా రూ.400 కోట్ల వరకు ఉన్నదని పెండింగ్ నిధుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనిపై సీఎం స్పందించి ఆర్థికశాఖ వద్ద పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనేది తెలుసుకున్నారు. దాదాపుగా రూ.300 కోట్లు త్వరలోనే విడుదల చేసి యూజీడీ స్కీమ్‌ని పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరా సమస్యలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటీఎంసీ పరిధిలో హైరైజ్డ్ బిల్డింగ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, అపార్టుమెంట్లు వచ్చేశాయని, అయితే వారంతా భూగర్భ జలంపైనే ఆధారపడి ఉన్నారని చెప్పారు. గుంటూరు నగరంలోకి

(మిగతా 8వ పేజీలో)

6

- గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు
- జనసేన నేతపై వైసీపీ సర్పంచి దాడి

దాల్ మిల్లులో చోరీని ఛేదించిన పోలీసులు

- రూ 4.35 లక్షల నగదు రికవరీ

మేడికొండూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

- 98 సర్వీసులకు రూ.5.13 లక్షల జరిమానా

తేమ.. తకరారు

- తక్కువ ఉన్నా అధికంగా ధర తగ్గింపు
- సీసీఐ సిబ్బంది తీరుపై రైతుల ఆగ్రహం
- ముఖ్యమంత్రి ఆదేశాలను పట్టించుకోని వైనం
- పాత నిబంధనతో రైతులను దోపిడీ చేస్తోన్న అధికారులు

పిడుగురాళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో వర్షాలు పడ్డాయి.. పత్తిలో తేమ శాతం అధికంగా ఉంది. ఈ క్రమంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలలో తేమ శాతాన్ని పెద్దగా పట్టించుకోవద్దని, నిబంధనలు పక్కనపెట్టి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయితే పిడుగురాళ్ల సీసీఐ కేంద్రం సిబ్బంది ఈ ఆదేశాలకు నీళ్లొదిలేస్తున్నారు. పత్తి శాతంలో తేమ శాతం అధికంగా చూపుతూ రైతులను దోచేస్తున్నారు. పది రోజుల క్రితం పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారం రోజుల వరకు 8 శాతానికి మించి తేమ ఉంటేనే ధరలో వ్యత్యాసం చూపారు. గత వారంలో తుపాన్ నేపథ్యంలో 10 శాతానికి పైగా తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను సీఎం ఆదేశించారు. అయితే ఇక్కడి అధికారులు మాత్రం పాత నిబంధననే పాటిస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. తేమ శాతంలో తేడా ఉందంటూ రైతుకొక రేటు చెల్లిస్తున్నారు. రైతులు ఇదేమిటని ప్రశ్నించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

దళారులదే రాజ్యం

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద దళారులే రైతుల అవతారమెత్తి పత్తిని విక్రయిస్తున్నారు. గ్రామాల్లో రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని దళారులు కొందరు సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చి రైతుల పేరిట విక్రయాలు జరుపుతున్నారు. కొందరు రైతులను వెంటబెట్టుకొచ్చి బయోమెట్రిక్ విధానంతో పత్తిని విక్రయిస్తున్నారు. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు ప్రాంతాల రైతుల పేరుతో కొందరు పత్తిని విక్రయిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.అదే రైతులు నేరుగా వస్తే నాణ్యతలో, తేమ శాతంలో తేడా అంటూ కొర్రీలు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి సీసీఐ కేంద్రాలలో ఇప్పటికే 50 వేల క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేశారు.



సీసీఐ కేంద్రం వద్ద పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఆర్టీసీలో ఓడీలపై డీపీటీవో సమీక్ష

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ గుంటూరు జిల్లా పరిధిలోని డిపోల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్)లపై జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్ .రవికాంత్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గుంటూరు-1,2 డిపోలతోపాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లో కొందరు ఉద్యోగులు అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ 'ఓడీలతో ఎంజాయ్' శీర్షికన ఈ నెల 6న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో కథనం ప్రచురితమైంది. దీనికి డీపీటీవో స్పందించారు. డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విభజిత జిల్లా వ్యాప్తంగా ఐదు డిపోల్లో 51 మంది అక్రమంగా ఓడీలు పొందుతున్నట్లు సమాచారం. అక్రమ ఓడీలపై ఆయన స్పష్టత తీసుకున్నారు. ఇందులో అత్యధికంగా గుంటూరు-2తో పాటు గుంటూరు-1లో ఉన్నట్లు గుర్తించారు. అంతేగాక పొన్నూరులో కూడా ఓ ఉద్యోగిపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఇలా అక్రమంగా ఓడీలు పొందుతోన్న వారిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అర్హుల అర్జీలను బుట్టదాఖలు చేసి అనర్హులకు ఓడీలు మంజూరుపై కూడా విచారణ జరుపుతున్నారు. అక్రమ ఓడీలను ఒకటి, రెండు రోజుల్లో రద్దు చేయాలని డీపీటీవో నిర్ణయానికి వచ్చారు.

కొత్త రసాయన చర్యల ఆవిష్కరణ సాధ్యమే



విద్యార్థులతో ఆచార్య ఏటీ బిజు

గుంటూరు(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్గానో క్యాటలిసిస్ ద్వారా అనేక కొత్త రసాయన చర్యలను ఆవిష్కరించడం సాధ్యమవుతుందనీ, అంతేకాకుండా ఇవి పరిశోధనలో పురాతన మార్గాలను తెరవగలవని ఐఐఎస్సీ బెంగళూరు ఆచార్య ఏటీ.బిజు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో గురువారం ఆయన మాట్లాడారు. ఆచార్య ఏటీ.బిజు మాట్లాడుతూ ఆర్గానోక్యాటలిసిస్ అనేది ఒక ప్రత్యేకమైన రసాయన పద్ధతి అని, ఇది పరిశోధన, పరిశ్రమల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి భోపాల్‌లోని ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ నితిన్ టి.పాటిల్ మాట్లాడుతూ రసాయన శాస్త్రం పరిశోధనల్లో రోజురోజుకు వినూత్న అభివృద్ధి చెందటంతోపాటు ఔషధ తయారీ,సేంద్రియ రసాయన శాస్త్రం, మెటీరియల్స్ సైన్స్ మధుమేహం వ్యాధులకు సంబంధించి మందులను రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఎస్.భాస్కర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ జి.శేఖర్, ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ సి.రఘు, వివిధ దేశాల ప్రతినిధులు, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా (డైక్ సెంటర్‌లో) మెడికల్ ఆఫీసర్, డెంటల్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను జిల్లా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబరు 30 లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అందజేయాలని ఆమె కోరారు. రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా దరఖాస్తులు పంపుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయుడు అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కిష్కిందపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వల్లభనేని వెంకటేశ్వరరావు బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయుడు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు ఎదుట లొంగిపోవడంతో నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మూలిక వైద్యంపై పరిశోధనలు రావాలి

- ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి
- ముగిసిన రెండు రోజుల ఫార్మసీలో జాతీయ సదస్సు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పెదకాకాని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కాపాడటం కోసం మూలిక వైద్యంలో విస్తృత పరిశోధనలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంఛార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి సూచించారు. వర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ ఔషధాలు కనుగొనడంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి పట్ల నిబద్ధత ఉండటంతో ప్రజారోగ్యం ఆ మేరకు సంతృప్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. తద్వారా విషతుల్యత లేని ఔషధాలను కనుగొనేందుకు విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. ఉదయం జరిగిన ప్లీనరీ సెషన్‌లో ఆచార్య గురువాయూరప్పన్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణలో నూతన ఆవిష్కరణలు, క్యాన్సర్ రోగులు ఎదుర్కొనే ఇతర ఇబ్బందులను నివారించడానికి తాను చేసిన పరిశోధనలో సత్ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులకు వివరించారు. హైదరాబాదులోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ ఆచార్య సీహెచ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తన పరిశోధనలో ప్రీ క్లినికల్ ల్యాబ్ అనుభవాలను వివరించారు. ఒక వైద్యుడు తప్పు చేస్తే ఒకరు, ఇద్దరు రోగులు మరణిస్తారనీ, అదే ఒక ఫార్మాసిస్టు వలన తప్పు జరిగితే కొన్ని వందల మంది ఇబ్బందులు పడతారని తెలిపారు. ఫార్మసిస్టులు కనుగొనే ఔషధాలు సమాజ రుగ్మతలను ఎదుర్కొనే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండు, మూడో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ చైర్మన్, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.విద్యాధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి తదితరులు మాట్లాడారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పోస్టర్ ప్రజెంటేషన్లకు 137 మంది పాల్గొనగా రెండు రోజుల జాతీయ సదస్సులో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు.

దాల్ మిల్లులో చోరీని ఛేదించిన పోలీసులు

- రూ 4.35 లక్షల నగదు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు

నాదెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాల్ మిల్లులో జరిగిన చోరీని పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ 4.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గణపవరం గ్రామ పరిధిలోని ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంకలో గల విజయ వాసవి దాల్ అండ్ రైస్ మిల్లు వారు ప్రతి రోజూ అమ్మకాలకు సంబంధించి నగదును బ్యాంకులో జమ చేస్తారు. శుక్రవారం వచ్చిన నగదును సమయం కుదరక సోమవారం వరకు బీరువాలోని లాకర్‌లో ఉంచారు. మంగళవారం రూ.4.35 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మిల్లు భాగస్వామిదారుడు కనకం లక్ష్మయ్య నాదెండ్ల ఎస్ఐ పుల్లారావుకు చోరీ విషయపై ఫిర్యాదు చేశారు.

ఏసీ రూమ్‌నే టార్గెట్‌గా....

గుంటూరులోని శారదా కాలనీకి చెందిన నిందితుడు మిక్కిలి సందీప్ వ్యసనాలకు బానిస అయ్యాడు. ఈ క్రమంలో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఏసీ రూమ్‌లే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇదే తరహాలో చోరీ చేశాడు. ఈ క్రమంలో దాల్ మిల్లు ఏసీ రూమ్ తాళాలు పగలగొట్టి బీరువాలోని నగదును చోరీ చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సీఐ సుబ్బయ్య నాయుడు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ పుల్లారావు, ఏఎస్ఐ రోసిబాబు, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్ బృందాలుగా ఏర్పడి నిందితుడి ఆనవాళ్లను గుర్తించారు. గణపవరంలో ఉన్న అతన్ని చాకచక్యంగా అరెస్టు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతనిపై ఏడు కేసులు ఉన్నాయని చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారని ఆయన వివరించారు. కాగా నాదెండ్ల పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ నాగేశ్వరరావు సందర్శించి రికార్డులు పరిశీలించారు.

మందులు.. ఏటిపాలు

(5వ పేజీ తరువాయి)

మందులు మిగిలిపోయినా, వాటిని పారేశారంటే అర్థం ఉంటుంది. కరోనా తర్వాత వస్తున్న రోగాలకు తగ్గ మందులన్నీ ఉన్నా, అవన్నీ మిగిలిపోవడం విడ్డూరమే. పారాసిటమాల్, ఇతర యాంటీబయోటిక్స్, విటమిన్ డీ 3, గ్యాస్, షుగర్, బీపీ వంటి నిత్యావసర మందులు కూడా నదిలో పారేసిన వాటిలో ఉండటం విశేషం. ఇకటి, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇన్ని మందులు గడువు ముగిసిపోయినవి ఉంటే, రాష్ట్రం మొత్తం మీద ఇంకెన్ని ఉంటాయనేది ఆందోళన కలిగించే విషయం. బలానికి సంబంధించి, ఐరన్ వంటి పోషక విలువలు తగ్గిన వారికి ఉపకరించే విటమిన్ ట్యాబ్లెట్లు కూడా వృథా చేశారు. ఖరీదైన ఇంజక్షన్లు కూడా పారేసిన వాటిలో దర్శనమిస్తున్నాయి. చివరకు చిన్న పిల్లలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు కూడా ఉపయోగించలేదంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ మందులను ప్రభుత్వం సరఫరా చేసిన తర్వాత రెండు వేసవి సీజన్లు వచ్చాయి. ఆ సమయంలో డీహైడ్రేషన్‌తో ఆస్పత్రి పాలైన వారు ఎందరో ఉన్నారు. వారికి ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా నదిలో పారేశారు. ఇక నిరోధ్ ప్యాకెట్లను కూడా పారేశారు.

సురక్ష అమల్లో నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వ కాలంలో పేదల కోసం అంటూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారు. 2023 సెప్టెంబరులో సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ రెండుసార్లు తిరిగి, సర్వే, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి. దీనికోసం 104 వాహనాన్ని ఉపయోగించుకున్నారు. చికిత్స అవసరం అనుకుంటే శిబిరాల్లో పరీక్షించి, మందులు అందేలా చూడాలి. అయితే ఇవేమీ అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జరగలేదు. దీంతో మందులన్నీ మూలన పడేశారు.

పైగా 2023లో పథకం అమలు జరిపితే, దానికి అవసరమైన మందులను 2022 చివరలో తయారు చేసినవి సరఫరా చేశారు. అవికూడా 2023, 2024 సంవత్సరంలో గడువు పూర్తయ్యే సమయంలో వాటిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ వాటినైనా గడువు ముగిసేలోపు రోగులకు అందించారా అంటే అదీ జరగలేదు. జ్వరం, యాంటీబయోటిక్స్ ట్యాబ్లెట్లు అందించలేకపోయారంటే ఏదో సాకు చెప్పవచ్చు. కానీ వాక్సిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కోవిడ్ ర్యాపిడ్, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు కూడా ఏటిపాలు చేశారంటే ఈ పథకం అమలులో ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలిందనేది అర్థమవుతుంది. గడువు ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే మందులు గడువు తీరాక విషంతో సమానం. ఇటువంటి ప్రమాదకర పరిస్థితులు కలిగించే మందులను, సెలైన్ సీసాలను కూడా నదిలో పారేయడం దారుణం. అవి నదిలో కొట్టుకుపోయి నీటిలో కలిసి ఆ నీరు కలుషితమవుతుంది. వాటిని తాగే జంతువులు, మనుషులు నది, సముద్ర జీవులకు హాని కలిగే అవకాశం ఉంది. అయినా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా మందులను నదిలో పారేయడంపై సమీప గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ నాయకులకు మాట్లాడే నైతిక అర్హత లేదని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడును సర్వనాశనం చేసిన దొంగలంతా మళ్లీ ఒక గూటికి చేరారని విమర్శించారు. అరాచకాలు, దుర్మార్గాలతో పాలన సాగించిన వైసీపీ నేతలు నేడు మళ్లీ ఏకమయ్యారని అన్నారు. ఇసుక, మైనింగ్ దోపిడీల నుంచి కబ్జాల వరకు ఐదేళ్లలో చేయని దుర్మార్గాలు లేవనీ, కోట్లు రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అరాచకాలు, హత్యలు, దోపిడీలు భరించలేకనే గత ఎన్నికల్లో పల్నాడు జిల్లాల్లోని ఏడుగురు ఎమ్మెల్యేలను ప్రజలు ఇంటికి పంపించారనీ, అయినా వారి ప్రవర్తనలో మార్పు లేదని దుయ్యబట్టారు. రాక్షస పాలనపై తిరుగుబాటు తీవ్రతను రాష్ట్రం మొత్తానికి పల్నాటి ప్రజలు తెలియజేశారన్నారు. ప్రజలను ఐదేళ్లపాటు భయభ్రాంతులకు గురిచేసి ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేసి ఇప్పుడు దొంగేదొంగ అని అరిచినట్లు కూటమిపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని అన్నారు.

రేపు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక ఈ నెల 14న స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల తరపున వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ ఎం సుబ్బరాజు గురువారం తెలిపారు. ఎంపికకు హాజరు అయ్యే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు, 70 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 22 నుంచి 25 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అదనపు సమాచారం కోసం పీడీ రాయల ఆంజనేయులు 9063577055 నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు అన్నారు.

పేరేచర్లలో భలే చికెన్ బేరం



చికెన్ కోసం ఎగుబడుతున్న స్థానికులు

మేడికొండూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో చికెన్ కోసం గురువారం షాపుల ముందు జనం బారులు తీరారు. భలే మంచి చౌక బేరమంటూ స్థానికులు చికెన్ కోసం ఎగబడ్డారు. సహజంగా చికెన్ కోసం షాపుల వద్దకు ఆదివారం ఎక్కువ మంది వెళ్తుంటారు. అందుకు భిన్నంగా గురువారం చికెన్ కోసం బారులు తీరడం విశేషంగా చెప్పుకుంటున్నారు. దీనికి కారణం చికెన్ ధర తగ్గించి అమ్మడమే. పేరేచర్లలో నూతనంగా చికెన్ షాపు పెట్టారు. ప్రారంభ ఆఫర్‌గా చికెన్ ధరను కిలో వంద రూపాయలుగా ప్రకటించారు. ఇంకేముంది తమ వ్యాపారం ఎక్కడ దెబ్బతింటుందోనని మిగతా షాపుల వాళ్లు కూడా ఇదే ధరకు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయం అందరికీ తెలియడంతో ఒక్కసారిగా జనం షాపుల వద్దకు చేరుకొని క్యూలో నిలబడి చికెన్ కొనుగోలు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ముప్పాళ్ళ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు వందల గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సోమేశ్వరరావు గురువారం తెలిపారు. బుధవారం ముప్పాళ్ళలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని విచారించామని, దీంతో వారు గంజాయి అమ్ముతున్నట్టుగా గుర్తించామన్నారు. ముప్పాళ్ళకు చెందిన పఠాన్ చాంద్ బాషా, కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బత్తుల నరసింహారావు గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చినట్లుగా తెలిపారు.

జనసేన నేతపై వైసీపీ సర్పంచి దాడి

మేడికొండూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం కొర్రపాడు సర్పంచి తనపై దాడి చేసి దూషించారని జనసేన తాడికొండ నియోజకవర్గ మీడియా కన్వీనర్ కందుల సైదయ్య గురువారం మేడికొండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ సర్పంచి బొడ్డు నాగమల్లేశ్వరరావు, ఆయన కుమారుడు సురేష్, అన్న కుమారుడు రాజేంద్రతో కలసి పంచాయతీ కార్యాలయం వద్ద ఉండగా వారు తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఉన్న సమస్యలపై వచ్చిన విభేదాల కారణంగా సైదయ్యపై దాడికి పాల్పడినట్టు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు సర్పంచి నాగమల్లేశ్వరరావు, అతని కుమారుడు సురేష్, అతని అన్న కుమారుడు రాజేంద్రపై కేసు నమోదు చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 582.40 అడుగులు ఉంది. ఇది 289.93 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6979 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 45,396 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 45,396 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి



వినయ్‌కుమార్ (ఫైల్)

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన గంగపట్ల వినయ్‌కుమార్ (23) పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. వినయ్‌కుమార్ గత మంగళవారం నుంచి కనిపించకుండా పోయాడు. అదే రోజు అతని కోసం కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండగా పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడి కాలువ వద్ద అతని ఫోన్ లిఫ్ట్ చేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా వినయ్‌కుమార్ సెల్‌ఫోన్‌తోపాటు చెప్పులు లభ్యమయ్యాయి. వినయ్‌కుమార్ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా గురువారం దుర్గిలోని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద మృతదేహం లభ్యమైంది. మాచర్ల పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన గురువారం మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన వీర్ల రాంబాబు, నాగేశ్వరమ్మ దంపతులు గురువారం తమ పొలంలో ఘర్షణ పడ్డారు. అనంతరం పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నం చేశారు. సమీప పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొలక కృష్ణ గురువారం వివిధ పనులపై ద్విచక్ర వాహనంపై మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి వెళ్లాడు. రాత్రి వేళ తిరుగు ప్రయాణంలో భైరవునిపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైకు పైనుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98.107.118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

మేడికొండూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



కేసుల వివరాలు వెల్లడిస్తున్న సీఆర్డీపీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

మేడికొండూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌డీపీ ఎస్ఈ పి.సుబ్రహ్మణ్యం, గుంటూరు టౌన్-2 ఏడీఈ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టారు. మేడికొండూరు మండలంలోని 16 గ్రామాలలో ఈ తనిఖీలు చేపట్టారు. 60 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి గ్రామాలలో 2,188 సర్వీస్‌లను తనిఖీ చేశారు. వాటిలో 98 సర్వీసులకుగానూ ఓవర్ లోడ్ కింద రూ. 5,13,500 లక్షలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం గుర్తించి మూడు సర్వీసులకు రూ.1.50 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం 102 సర్వీస్‌లపై కేసులు నమోదు చేసి, రూ. 6.65 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు సీఆర్‌డీపీ సూపరింటెండెంట్ ఇంజనీరు పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ తనిఖీల్లో గుంటూరు రూరల్ ఏడీఈ గురునాథం, చిలకలూరిపేట ఏడీఈ ఆర్.అశోక్ కుమార్, గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలోని 9 మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

49,551 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 50,816 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,551 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 43,384 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	7500	14500
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	8000	11500
273	9000	11500	273	8500	12500
341	8000	15000	341	8000	13500
4884	11000	11000	4884	9500	12500
సూపర్ 10	-	-	సూపర్ 10	11800	11800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	8000	11500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	9500

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 41.85 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



జోన్ డైరీ

● సత్తెనపల్లి కోర్టు పరిధిలో ఈనెల 14న జరగనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించు కోవాలని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ కే విజయ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. 2024 అక్టోబరు 15 వరకు రిజిస్టర్ అయిన మద్యం కేసుల్లో పట్టుబడిన వారి నుంచి కాంపౌండింగ్ ఫీజు కట్టించుకొని వారి పై ఉన్న ఉన్న కేసులను కోర్టుల ద్వారా ఎత్తివేయనున్నట్టు తెలిపారు. శుక్రవారం సాయంత్రంలోపు మద్యం కేసుల్లో నిందితులు సమీపంలో ఎక్సైజ్ స్టేషన్‌లలో సంప్రదించి కాంపౌండింగ్ ఫీజు చెల్లించవచ్చని ఆయన ఆయన సూచించారు.

● మాచవరం ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి శ్రీనివాసరావు తెలిపారు. 16, 17 తేదీల్లో చెన్నాయపాలెం, గంగిరెడ్డిపాలెం, మాచవరం, పిన్నెల్లి, తురకపాలెం, వేమవరం గ్రామాల్లో, 18, 19 తేదీల్లో ఆకురాజుపల్లి, కొత్తగణేషునిపాడు, మల్లవోలు, మోర్జంపాడు, పిల్లుట్ల, శ్రీ రుక్మిణీపురం గ్రామాల్లో జరుగుతాయన్నారు.

మల్లవోలులో గ్రామ సభ

మాచవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవోలు గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. వెబ్ ల్యాండ్‌లో భూముల నమోదుచేయటం, 22ఎ నుంచి తొలగించటం తదితర సమస్యలపై పలువురు అర్జీలు అందజేసినట్టు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు సభలో సర్వేయర్ సాల్మన్ రాజు, ఆర్‌ఐ కోటేశ్వరరావు, వీఆర్‌వో అబిలేల్, రెవెన్యూసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణాల కోసం
అర్జీలు పెట్టుకోండి

మాచవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గృహ నిర్మాణాల కోసం ఆయా గ్రామాల సచివాలయాల్లో అర్జీలు పెట్టుకోవాలని నరసరావుపేట పార్లమెంటరీ కార్యనిర్వాహక టీడీపీ కార్యదర్శి యర్రపల్లి రామారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ కార్డు, కులం, ఆదాయం, ఇంటి నివేశన స్థలం వంటి ధ్రువీకరణ పత్రాలను అర్జీకి జత చేయాలని తెలియ జేశారు.

కంటి వైద్య శిబిరం

సత్తెనపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఆవరణలో, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని న్యాయాధికారులు తౌసిఫ్ హుస్సేన్, మహమ్మద్ గౌస్‌లు ప్రారంభించారు. నరసరావుపేట మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కంటి వైద్యులు రామలింగారెడ్డి శిబిరంలో పాల్గొని న్యాయాధికారులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బందికి తమ సిబ్బందిచే కంటి పరీక్షలు చేయించారు.

వాహనాల అపహరణ కేసులో
వ్యక్తి అరెస్టు.. రిమాండ్

సత్తెనపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. అచ్చంపేటకు చెందిన అన్నా క్రిశాంత్ వృత్తి రీత్యా బైక్ మెకానిక్ అని, ఇతను సత్తెనపల్లి పరిధిలోని వైద్యశాలల్లో, ఇంకా పలు ప్రాంతాల్లో ఆరు ద్విచక్ర వాహనాలను అపహరించినట్టు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మొక్కలు నాటండి..

మాచర్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండని కేసీపీ జనరల్ మేనేజర్ వీ వెంకటరమణ సూచించారు. పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో గురువారం కేసీపీ, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 మొక్కలను నాటారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, బాలయ్య, వెంకట్రామయ్య, పరసా నాగార్జున్, కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేష్, అన్నపురెడ్డి లక్ష్మి, రాధ, సత్యప్రసాద్, రామ్మూర్తి, కర్నాటి వాసు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి
భూమిపూజ

కారంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడి నరిపాడులో ని పోతురాజు గుట్టలో మినీ వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం గురువారం టీడీపీ నేతలు భూమిపూజ నిర్వహించారు. కాలనీ వాసులు తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శి రాము, వసంత రామారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

రెంటచింతల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో జీజస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ మామిడి ఐజాక్ నేతృత్వంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి కేక్ కట్ చేసి క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ దేవానందం,సామ్యేల్,శ్యాంబాబు, సిల్వరాజ్, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం ఏం చేశావ్ పిన్నెల్లి?

● కమీషన్ల కోసం ప్రాజెక్టుల అడ్డుకున్నావు
● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ళు ఎమ్మెల్యేగా ఉండి రైతుల కోసం ఏం చేశావు అని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శల గుప్పించారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రైతులను ముంచిన సర్కారు అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఎంతోమంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. రైతులకు నీరు అందించేందుకు టీడీపీ హయాంలో జెర్రివాగు, దర్వాజెల, పేటసన్నిగండ్ల లిఫ్ట్ ఇరిగేషన్లను కమీషన్ల కోసం కక్కుర్తి పడి అడ్డుకున్న నువ్వా రైతుల గురించి మాట్లాడేది అని అన్నారు. మేజర్, మైనర్ కాలువల మరమ్మతుల పేరుతో రూ. 20 కోట్లు దోచుకున్నారన్నారు. రైతులను బెదిరించి ఆస్తినీ, పొలంబాకు భూములను సాగర్ ఎయిర్‌పోర్టు ప్రాంతంలో భూములను లాక్కున్నారన్నారు. టౌన్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో దేవుడు మాన్యం భూముల వీకర్స్ సోదరుడు వెంకటరామిరెడ్డి ఆతని పేరుపై ఎక్కించుకొని లబ్ధిపొందారన్నారు. ఎంతో మంది రైతుల భూములను ఆన్‌లైన్‌లో పేరు మార్పించుకొని బ్యాంకుల్లో కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో మీరు దోచుకున్న భూములపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

పంచాయతీగా మారనున్న విజయపురిసౌత్

నాగార్జున సాగర్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చినట్టు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. సాగర్ ప్రాజెక్ట్ కింద ఉండటంతో అభివృద్ధి లేక వెనుకబడిపోయిందని, పంచాయతీగా మారితే అభివృద్ధి చేసి టూరిజంగా ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, కట్టం సైదయ్య, మున్నా రాంబాబు, మద్దిగుప్ప వెంకటరామిరెడ్డి, వద్రం నాయక్, శ్రీనివాస్ యాదవ్, శివ, వాసు, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సుస్థిర అభివృద్ధి

● బాపట్ల ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వెంకటరావు



మాట్లాడుతున్న రాష్ట్ర శిక్షకులు వెంకటరావు

క్రోసూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన సాధ్యమేనని శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు, బాపట్ల ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వెంకటరావు అన్నారు. గురువారం క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల మూడవ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనేవి 2030 నాటికి ప్రపంచంలోని బహుముఖ రంగాల్లో పేదరికాన్ని రూపు మాపటానికి ఉద్దేశించినవిగా ఉన్నాయన్నారు. విశ్వజిత సమృద్ధి కోసం ఒక సమానమైన, న్యాయమైన సమష్టి చర్య ద్వారా స్థిరమైన అభివృద్ధిసాధించటం సాధ్యమని నిరూపిత మైందన్నారు. 17 లక్ష్యాలను తొమ్మిదిగా విభజించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎప్పటికప్పుడు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవనవిధానం, ఆరోగ్యం, పాఠశాలల్లో తెలుగు వాడకం, పిల్లల డ్రాపవుట్లు తగ్గించడానికి కారణాలు, పేదరిక నిర్మూలన మొదలైన విషయాల్లో ఉద్యోగులందరూ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ళపల్లి కోటయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణ అధికారి శిశా క్యామ్సన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు

కారంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురువారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా విద్యుత్ వినియోగానికి సంబంధించి రూ. 10.95 లక్షల అపరాధ రుసుము విధించారు. కారంపూడి విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులు విలేకరులకు వివరాలను వెల్లడించారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మందికి రూ. 11 వేలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 7 మందికి రూ. 2 లక్షలు, అనుమతి లేని కేటగిరి విద్యుత్ వినియోగానికి సంబంధించి రూ. 45 వేలు, అదనపు విద్యుత్ వాడకానికి సంబంధించి 100 మందికి రూ. 3.39 లక్షలు, అనుమతికి మించిన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన 1 సర్వీసును గుర్తించి రూ. 5 లక్షలు అపరాధ రుసుము విధించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవితేజ, శ్రీనివాసరావు, ఏఈ కోటేశ్వరరావు, చంద్రశేఖర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

పిడుగురాళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులను ఏర్పాటు చేస్తుందని తహసీల్దార్ జే మధుబాబు తెలిపారు. గురువారం కరాలపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల, పట్టణాల పరిధిలో భూసమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిల్లో సత్వరమే పరిష్కరం చదగాని భూమి పరిష్కారం లభిస్తుందని, మిగిలిన వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారమవుతాయని తహసీల్దార్ తెలిపారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనుబాబు, వీఆర్వో మకుక్, టీడీపీ మండల కన్వీనర్ గుండికోట వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, కరాలపాటి జాని, సంకుల వెంకటేశ్వర్లు, అంజనేయరెడ్డి, మంగిరెడ్డి, రాజశేఖర్, షరీఫ్, బాజి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా తదితరులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సియోన్ లూథరన్ చర్చిలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్టియన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నాను చర్చి పెద్దలు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంగంజాగర్లమూడి కేవీఆర్‌కే ప్రసాద్, పాస్టర్లు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూమి కోసం సీఎంకి ఫిర్యాదు

● సీఎం ఆఫీస్ ఆదేశాలతో రంగంలోకి జిల్లా సర్వేయర్

రెంటచింతల,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):167 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టా భూమిని కోల్పోయిన తనకు నష్టపరిహారం చెల్లించకుండా రహదారి నిర్మించారని ఆక్షేపిస్తూ పాలువాయి గ్రామానికి చెందిన శ్రీరాములను శ్రీనివాసాచారి సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వేయర్ బాను కీర్తితో పాటు రెవెన్యూ అధికారుల బృందం సర్వేచేపట్టింది. 190 సర్వే నెంబరులో ఎకరన్నర పొలం వుండగా అందులో 22 సెంట్లలో జాతీయ రహదారికి సంబంధించి మెటల్ రోడ్డు వేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించగా సంబధిత కాంట్రాక్టర్ నుంచి సమాధానం రాలేదు. ఈ విషయంలో బాధితుడికి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈసర్వేలో డీఐఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ నగేష్, ఆర్ఐ పల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జాజిని సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ

పర్యావరణ వేత్తకి సన్మానం

కారంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)ని గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ సన్మానించి జ్ఞాపికను అందించారు. అడవుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ జాజి చేస్తున్న కృషిని గుర్తించి గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో ఈ సన్మానం జరిపారు. అడవుల పరిరక్షణ, మొక్కలు నాటడం, వన్యప్రాణుల సంరక్షణ తదితర విషయాలపై జాజిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాజి తండ్రి రామయ్య పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆరు పోలింగ్ బూత్‌లు..

రెంటచింతల,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలంలో ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి 6 పోలింగ్ బూత్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసినట్టు ఎన్నికల సాగునీటి సంఘ ఎన్నికలఅధికారి కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెంటచింతల, తుమ్మకోట, పశర్లపాడు, మిట్టగుడిపాడు, రెంటాల, పాలువాయి గ్రామాల్లోని బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.ఉదయం 8 గంటల నుంచి సభ్యులను ఎన్ను కుంటారని మధ్యాహ్నం వేళ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. ఈనెల 17న డీసీ ఎన్నికలు ఉంటాయని ఆయన తెలిపారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

క్రోసూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేమర్రు, అందుకూరు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సంబంధమైన సమస్యల పరిష్కారం కోసమే ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సదస్సుల్లో గ్రామ స్థాయి అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

రాజుపాలెం,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామంలో మిరప రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. లాంఫామ్ శాస్త్రవేత్త పి గంగాధర్ మాట్లాడుతూ మిర్చిపంటలోని బీడపేలు గురించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెరికల్లు ద్వారా మిగతా గ్రామాల్లోని రైతులు సాగుచేసిన హరగాయలు, మిరప పంటలపై అధిరిగిందులు సాధించేందుకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గణపవరం గ్రామ రైతులు, ఉద్యాన అధికారి డి నవీన్, వీహెచ్ఏ రమేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



నిల్వనీటిని పరిశీలిస్తున్న రవీంద్ర రత్నాకర్ తదితరులు

రాజుపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటిపరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. గురువారం కొండమోడులో పరిసర ప్రాంతాలను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి జ్వరాలపై సర్వే నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని, నివాస గృహాలలో, పరిసర ప్రాంతాలలో పాతటైర్లు, కొబ్బరిబోండాలను, నిల్వనీటిని గుర్తించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు, ఎంఎల్ఓ శారద, హెల్త్ అసిస్టెంట్ సాదిక్ హుస్సేన్, ఆశ కార్యకర్తలు సుజాత, మున్నీరా పాల్గొన్నారు.

పెదరామయ్య మృతి
టీడీపీకి తీరని లోటు



పెదరామయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

దుర్గి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత యాగంటి పెద రామయ్య మృతి పార్టీకి తీరని లోటని, ఆయన సేవలు మరువలేనివని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. అనారోగ్య కారణాలతో కొన్నాళ్లుగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మండల కేంద్రమైన దుర్గికి తీసుకురాగా గురువారం ఎమ్మెల్యే దుర్గికి చేరుకొని పెదరామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పెదరామయ్య 1963 నుంచి 1967 వరకు దుర్గి సర్పంచ్‌గా సేవలందించారన్నారు. తన కుటుంబానికి పెద రామయ్యకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. అనంతరం పెద రామయ్య కుటుంబ సభ్యులతో తన సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, మంగులూరి అంజయ్య, పుల్లయ్య, మాగులూరి నారయ్య, కీలా రమేష్, సింగు నాగేశ్వరరావు, గోపాల్, మేకల దాను పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన టీంకి బహుమతి అందిస్తున్న రమేష్, రాము తదితరులు

వాలీబాల్, కబడ్డీ పోటీల్లో
వికాస్ కళాశాల టీం విజయం

పెదకూరపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఆర్ఎస్‌ఆర్ శ్రీ చైతన్య హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల10 నుంచి జరిగిన మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల్లో వికాస్ కళాశాల టీం చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వాలీబాల్‌లో పెదకూరపాడు జీఆర్ఎస్‌ఆర్ శ్రీచైతన్య హైస్కూల్ ద్వితీయ విద్యార్థుల టీందిత్తీయ స్థానాన్ని సాధించారు. విజేతలకు బహుమతిగా రూ.20 వేల నగదు, జ్ఞాపికలను టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ రామ గోపాలరావు, గల్లా బాలకృష్ణ, గ్రామ సర్పంచ్ గుడివాడ రాము, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, గల్లా శివ నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గుత్తా లక్ష్మణరావు రామకోటేశ్వర మెమోరియల్ నిర్వాహకులు, స్పోర్ట్స్ అకాడమీ ప్రతినిధులు గుత్తా కవిత రాములు విజేతలను ప్రకటించారు.


దశాబ్దాల నాటి సమస్యకు చరమగీతం

● పిల్లివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడి

రెంటచింతల,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడిన ఘనత సీఎం చంద్రబాబునాయుడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే జూలకంటి రెంటచింతలలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారిన పశర్లపాడు గ్రామ సమీపంలోని పిల్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ప్రస్తుతం శిథిలమైన బ్రిడ్జికి దిగువన 5 కానాలతో పాటు 5 మీటర్ల ఎత్తులో 100 అడుగుల దూరంలో 50 మీటర్ల పొడవైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. పశర్లపాడు, జెట్టిపాలెం గ్రామాల పొలిమేరల్లోంచి 1 కి.మీ సీసీ రోడ్డు వేస్తారన్నారు. పాలువాయి గ్రామం వద్ద పిల్లివాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు చేసి ఈఎన్‌సీ ఆమోదం కోసం పంపించామన్నారు. సత్రశాల వద్ద 2025 మార్చి నాటికి రూ.100 కోట్లతో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు కానుందన్నారు. మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిపై వేగంగా ముందుకు వెళతామన్నారు. సమావేశంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, ఎం.రాజారెడ్డి, జోద పాటి రామకృష్ణ, శౌరెడ్డి, రాయపరెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పీఆర్కే..

మాచర్లటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రత్యక్షమయ్యారు. హైదరాబాద్ నుంచి నరసరావుపేట వెళ్లేందుకు బయలుదేరిన ఆయన మార్గ మధ్యంలో బుధవారం తెల్లవారుజామున స్వగృహమైన మాచర్లకు వచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ కేడర్ ఆయన ఇంటి వద్దకు గురువారం తెల్లవారుజామున చేరుకున్నారు. ఎన్నికల అనంతరం మాచర్లకు దూరంగా ఉన్న రామకృష్ణారెడ్డి గురువారం ఆయన గృహంలో వైసీపీ కేడర్‌తో కలుసుకొని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం ఆయన బయలుదేరి నరసరావుపేట వెళ్లారు.



శౌరయ్యకు శుభాకాంక్షలు తెలిపిన పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి

శౌరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

నకరికల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య పుట్టినరోజు వేడుకలను గురువారం తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శౌరయ్య కేక్ కట్ చేశారు. శౌరయ్యకు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, కనుమూరి బాజీ చౌదరి, చింతపల్లి ఫకీర్ అహ్మద్, కరాలపాటి వలి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాగోతు శౌరయ్య పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శౌరయ్య జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, శౌరయ్యలు కట్ చేసి పార్టీ నేతలు కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎలిసెడి రామస్వామి, కనుమూరి బాజీచౌదరి, గోగినేని కోటేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, కట్టా శంకరరావు పాల్గొన్నారు.



శౌరయ్యకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కన్నా



కోటనెమలిపురి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు..

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు శ్రేయస్సే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కోట నెమలిపురి గ్రామంలో రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే కన్నా హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులతో 100 శాతం సమస్యలు పరిష్కార మవుతాయన్న ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. వైసీపీ హయాంలో జగిరిన భూకబ్జాలు, ఆస్తుల ఆక్రమణలపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని, బాధితులకు న్యాయం జరుగుతుందన్న భరోసా లభిస్తుందన్నారు. మీ భూమికి భద్రత కల్పించే మాదే అనే నినాదంతో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయన్నారు. సందర్భంగా పలువురు రైతులు, మహిళల నుండి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణ, కూటమినేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

పెదకూరపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ భూముల రికార్డులను పరిశీలించుకొని కోవాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ మేనెల దానియేలు అన్నారు. మండలంలోని పాటిబండ్లలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ, ఏరువ బాలిరెడ్డి, డీటీ లూథర్ రామ్, వీఆర్వో పేరికల నాయుడమ్మ పాల్గొన్నారు.

విద్యా దాత గుత్తికొండ పద్మ

పెదకూరపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దాతృత, విద్యాదాత గుత్తికొండ పద్మ సేవలు మరువ లేనివని ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని 75 తాళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు భూదానం చేసిన విద్యాదాత గుత్తికొండ పద్మ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పద్మ కుటుంబం ఇవ్వటికీ హైస్కూల్‌కు పలువిధాలుగా అభివృద్ధిలో చేయూత నందిస్తున్నారన్నారు. అలాంటి వారిని ప్రతివారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రెవెన్యూ సదస్సు

దుర్గి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమహేశ్వరపాడులో గురువారం తహసీల్దార్ పనీంద్రకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



డాగ్.. డయాబెటిస్!





- కుక్కల్లో ప్రబలుతున్న షుగర్ వ్యాధి
- 1 నుంచి 5 శాతానికి పెరుగుదల
- మితిమీరిన ఆహారమే కారణమంటున్న వైద్యులు
- పందెపు ఎద్దుల్లోనూ ఇదే సమస్య
- డయాలసిస్ యూనిట్ కోసం విజ్ఞప్తి

షుగర్ వ్యాధి మనుషులనే కాదు కుక్కలను కూడా అల్లాడిస్తోంది. ఈ మధ్య కాలంలో కుక్కల్లో షుగర్ వ్యాధి బాగా ప్రబలుతున్నట్లు పశు వైద్యులు గుర్తించారు. గతంలో డాగ్ డయాబెటిస్ కేసులు (కుక్కల్లో షుగర్ వ్యాధి) ఒక శాతం వరకు ఉండేవి. ఈ మధ్య కాలంలో ఐదు శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. గుంటూరులోని జిల్లా పాలీ క్లినిక్ వైద్యులు కూడా కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలుతున్నట్లు గుర్తించారు.

గుంటూరు సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎక్కువ శాతం కుక్కలు షుగరు వ్యాధికి గురవుతున్నాయి. వివిధ సమస్యలతో ఆసుపత్రికి తీసుకువచ్చిన కుక్కలకు పరీక్షలు నిర్వహించగా షుగర్ వ్యాధి ఉన్నట్లు తేలుతుందని పశువైద్యులు చెబుతున్నారు. కుక్క రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ 76 ఎంజీ/డీఎల్ నుంచి 119 ఎంజీ/డీఎల్ వరకు ఉంటే షుగర్ సాధారణ స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. వ్యాధి బారిన పడిన కుక్కల రక్త నమూనాల్లో గ్లూకోజ్ లెవెల్స్ 120 ఎంజీ/డీఎల్ నుంచి 160 ఎంజీ/డీఎల్ పైన ఉంటున్నట్లు తేలింది. షుగర్ వ్యాధి సోకిన కుక్కలు ఎక్కువగా నీళ్లు తాగటం, చాలా నీరసంగా ఉండటం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయటం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, కంటిలో శుక్లాలు కలిగి చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతూ ఉంటాయని పశు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

అతి ప్రేమతో అనర్థాలు..

కుక్కల్లో షుగర్ వ్యాధి ప్రబలటానికి ప్రధాన కారణం మారిన ఆహారపు అలవాట్లేనని తెలుస్తోంది. వాటి మీద ఉన్న అతి ప్రేమతో ఏదిపడితే అది తినిపించటం ప్రాణాల మీదకి తెస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బిర్యానీ ఎక్కువగా తినిపించటం, పిజ్జాలు, బర్గర్‌లు పెట్టడం, జంక్ ఫుడ్, శీతల పానీయాలు అతిగా తాగించడం, శారీరక శ్రమ లేకపోవటం వలన ఊబకాయం ఏర్పడి కుక్కలు షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు గుర్తించారు. వయస్సు ప్రభావం కూడా వ్యాధికి కారణంగా కనిపిస్తుంది. కుక్క మధ్య వయస్సుగా పిలిచే 5 సంవత్సరాల తర్వాత చాలా వాటిల్లో వ్యాధి లక్షణాలు ఉంటున్నట్లు తెలుస్తోంది. కుక్కల్లో ఎక్కువగా కనిపించే చర్మ వ్యాధుల నివారణ



కొరకు వినియోగించే స్టెరాయిడ్స్ దీర్ఘకాలిక వాడకం షుగర్ వ్యాధి ముప్పును తెచ్చిపెడుతోంది.

గన్నవరం వెళ్లాల్సి వస్తుంది..

గుంటూరులోని జిల్లా పశువైద్యశాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి రిఫరల్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఎక్కువ కేసుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ కన్పిస్తుంది. అటువంటి సందర్భంలో కిడ్నీ ఫెయిల్ అయిన పశువు జీవిత కాలం పెంచటానికి డయాలసిస్ మాత్రమే చివరి అవకాశం అని వైద్యులు చెబుతున్నారు. గుంటూరులోని పాలీ క్లినిక్‌లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివలన కిడ్నీ ఫెయిల్యూర్ కేసులను దూరంలో ఉన్న గన్నవరం వెటర్నరీ కాలేజికి పంపే ఇబ్బందులు తప్పుతాయని అంటున్నారు.

పందెపు ఎద్దుల్లోనూ...

ఈ మధ్య కాలంలో పందెపు ఎద్దుల్లోనూ షుగర్ వ్యాధి గుర్తించినట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి వచ్చిన ఎద్దులకు నిర్వహించిన యూరిన్, రక్త పరీక్షల్లో షుగర్ వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. గుంటూరు పాలీ క్లినిక్‌లో కిడ్నీ ఆరోగ్యాన్ని తెలియజేసే క్రియాటిన్ లెవల్స్ కూడా పరీక్షల ద్వారా నిర్ధారిస్తున్నారు. అనారోగ్యంతో వచ్చిన పశువులకు లివర్‌లో టోటల్ ప్రోటీన్, ఆల్బ్యుయుమిన్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, ఆల్బ్యుయుమిన్ పాస్పటేవ్, కిడ్నీలో క్రియాటిన్, బ్లడ్ యూరియా పరీక్షలు చేసి రోగాన్ని గుర్తిస్తున్నారు.

ఇన్సులిన్ వాడకమే శరణ్యం



కుక్కల్లో షుగర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత ఇన్సులిన్ వాడుతున్నట్లు గుంటూరు పాలీ క్లినిక్ వైద్యులు చెబుతున్నారు. బరువును బట్టి ఇన్సులిన్ వేయాల్సిన యూనిట్లు నిర్ణయిస్తామని చెబు తున్నారు. ఉదాహరణకు కుక్క బరువు సుమారు ఐదు కిలోల వరకు ఉంటే 4 నుంచి 5 యూనిట్లు ఇన్సులిన్ వేయాలని చెబుతున్నారు. ఇన్సులిన్‌లో కూడా మూడు రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్, ఇంటర్మీడియట్ -యాక్టింగ్ ఇన్సులిన్, లాంగ్-యాక్టింగ్ ఇన్సులిన్ ఉన్నట్లు చెబుతున్నారు. అత్యవసర చికిత్సలు, ఆపరేషన్ సమయం లో షార్ట్-యాక్టింగ్ ఇన్సులిన్ వాడుతున్నారు. దానివల్ల కుక్క రక్తంలో గ్లూకోజ్ స్థాయి వెంటనే స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యకర ఆహారం పెట్టాలి



ఎంతోమంది చాలా ప్రేమతో కుక్కలను పెంచుకుంటున్నారు. వాటికి ఆరోగ్యకర ఆహారం పెట్టాలి. ఇష్టం వచ్చినట్లు ఆహారం ఇవ్వటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కూల్ డ్రింక్స్ తాపడం, చాక్లెట్‌లు పెట్టడం వంటివి హానికరం. కుక్కలకు చేపలు అసలు పెట్టకూడదు. వాటిని ప్రేమతో పెంచేటప్పుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా యజమానుల పైనే ఉంటుంది.

- మంగళగిరి రత్నజ్యోతి, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

డయాలసిస్ యూనిట్ ఉంటే బాగుంటుంది



గుంటూరు జిల్లా పశువైద్యశాలకు డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కిడ్నీకి సంబంధించిన కేసులకు ఇక్కడ మెరుగైన వైద్యం చేసే అవకాశం ఉంటుంది. డయాలసిస్ సకాలంలో ప్రారంభించటం వల్ల అనారోగ్యం బారిన పడిన పశువుల జీవిత కాలం పెంచే అవకాశం ఉంటుంది.

- లక్కింశెట్టి నాగేశ్వరరావు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

ఉత్తరాఖండ్‌దే పైచేయి

- తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యం



అభిమన్యు
72 పరుగులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్‌పై ఉత్తరాఖండ్ జట్టు పైచేయి సాధిస్తుంది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 95 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 349 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్తరాఖండ్ బ్యాటర్లు అభిమన్యు 72, అనయ నేగి 71, మయాంక్ ముదిలా 63, కుశగ్ర కోరంగ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్ ఆదిత్య రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

అమరావతిలో 'ఫైవ్'స్టార్ హోటల్స్

విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో స్టార్ హోటల్స్ ఏర్పాటుకు తీవ్ర పోటీ నెలకొంది. అతి త్వరలో ఐదు స్టార్ హోటల్స్ ఏర్పడబోతున్నాయి. స్టార్ హోటల్స్ ఏర్పాటుకు ఆయా సంస్థల యాజమాన్యాల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. నూతన పర్యాటక పాలసీ తీసుకు వస్తున్న నేపథ్యంలో, హోటల్స్ రంగం ఎంతో ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం భూ ప్రతిపాదనల దశలో ఉన్నాయి. అమరావతిలో ముందుకు వచ్చిన సంస్థలను చూస్తే ఐఆర్‌సీటీసీ, అట్మాస్ఫియర్ కేర్, ఒబెరాయ్ గ్రూప్, తాజ్ గ్రూప్‌కు చెందిన ఐహెచ్‌సీఎల్, రహేజా గ్రూపులు ఉన్నాయి. ఐర్‌సీటీసీ 3 ఎకరాలు, అట్మాస్ఫియర్ కేర్ కు 10 ఎకరాలు, ఐహెచ్‌సీఎల్‌కు 10 ఎకరాలు, ఒబెరాయ్ గ్రూప్‌కు 10 ఎకరాలు, రహేజా గ్రూప్‌కు 5 ఎకరాల చొప్పున కావాల్సి ఉంది. రహేజా గ్రూప్ విజయవాడ లో కూడా కృష్ణానది ఒడ్డున స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి ఐదెకరాలు కావాల్సి ఉంది. వాంటేజ్ గ్రూప్ మచిలీపట్నంలోని మంగినపడి బీచ్ దగ్గర స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి 10 ఎకరాలు కావాల్సి ఉంది. ఆయా సంస్థలతో తుది అగ్రిమెంట్లు చేసుకునే క్రమంలో భూములను స్వాధీనం చేసే అవకాశం ఉంది.

టమాట లోడు లారీ బోల్తా



గుంటూరు - చిలకలూరిపేట ఎన్‌హెచ్-16పై బుడంపాడు బైపాస్ వద్ద కర్ణాటక నుంచి టమోటా లోడుతో వస్తున్న లారీ డివైడర్‌ని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. **- గుంటూరు**

లాలుపురం శివారులో యువకుడి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- నమ్మకంగా తీసుకు వచ్చి రాళ్లతో కొట్టి చంపిన నిందితులు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌పురం రోడ్డులోని భవానిపురంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. హతుడిని లాలాపేటకు చెందిన షేక్ మస్తాన్‌షరీఫ్ (40)గా గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ లాలాపేటలోని బోసుబొమ్మ సెంటర్‌లో మొబీనా మెటల్ స్టోర్ అనే దుకాణం నిర్వహిస్తున్నాడు. తన తండ్రితో కలిసి వ్యాపారం చేస్తున్నాడు. అతనికి, భార్యకి మనస్పర్థలు వచ్చి 2020లో విడిపోయారు. ఇదిలాఉంటే గతంలో వీరి షాపులో ఆర్ అగ్రహారం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొంతకాలం పని చేసింది. ఆమెతో మస్తాన్ షరీఫ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ తరువాత కొంత కాలానికి ఆమెను పని నుంచి తీసివేశారు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం కొనసాగుతూనే ఉంది. ఆర్‌అగ్రహారంకు చెందిన ఆమెకు భర్త లేకపోవడంతో ఇతను నేరుగా ఇంటికి వెళ్తూ ఉండేవాడు. మద్యం తాగుతూ అక్కడే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇది ఆమె కుమారుడుకి ఇష్టం లేదు. షరీఫ్ రాకపట్ల ఆమె కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నాడు. మా ఇంటికి వద్దు.. మా పరువు పోతుంది.. అని పలుసార్లు షరీఫ్‌ని వారించాడు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆగ్రహించిన యువకుడు ఎలాగైనా షరీఫ్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. దీంతో షరీఫ్ దుకాణంలో పని చేసే సంగడిగుంటకు చెందిన సుభానితో కలసి పథకం రూపొందించాడు. ఈ క్రమంలో ఈ నెల 10న సాయంత్రం షరీఫ్‌ను షాపులో పని చేసే సుభాని గాంధీపార్క్‌కు అని చెప్పి బయటకు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమె కుమారుడుతోపాటు మరో వ్యక్తి కలిశాడు. నలుగురు లాలుపురం శివారు భవానిపురం వద్ద ఖాళీ స్థలాల్లో మద్యం తాగారు. అక్కడ ముగ్గురు కలిసి షరీఫ్‌పై రాళ్లతో దాడి చేసి హత మార్చారు. మృతదేహం కనిపించకుండా లోపల ముళ్ల చెట్ల వైపు పడేశారు. అయితే రాత్రికి షరీఫ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సుభానీని అడిగారు. అయితే షరీఫ్‌కు వాంతులు కావడంతో జీజీహెచ్‌కు వెళ్లాడని చెప్పాడు. అనుమానం వచ్చి సుభానిని గట్టిగా అడగ్గా షాపులో పని చేసిన మహిళ కుమారుడు కొట్టాడన్నారు. గురువారం ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికి అటుగా వెళ్లగా మృతదేహం బయటపడింది. విషయం తెలిసిన వెంటనే సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వంశీధర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. హత్యకు గురైన షరీఫ్ అక్క ఆరీఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యలో పాల్గొన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కాగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు

- రెండేళ్లు నాకు నరకం చూపించాడు
- రోజుకు రూ.4 వేలు చొప్పున వసూలు చేశాడు
- వైసీపీ నేత నుంచి ప్రాణ రక్షణ కల్పించండి
- మీడియా ముందు బాధిత మహిళ ఆవేదన



గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాను వైసీపీ నాయకుడునని, తనకు వైసీపీ నేతలు అప్పిరెడ్డి, మద్దాలి గిరి తెలుసునని చెప్పి నన్ను బెదిరించి లొంగదీసుకున్నాడు, ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసి తనను రెండేళ్ల పాటు చిత్రహింసలకు గురి చేసి నరకం చూపించాడని బాధిత మహిళ వాపోయారు. గురువారం నగరంపాలెంలోని ఓ న్యాయవాది నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను చిలకలూరిపేట రోడ్డులో మరమరాల బట్టీ, కిరాణాషాపు నిర్వహిస్తుంటానని తెలిపారు. సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వెంగళాయపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావు నాపై కన్నేసి నన్ను లొంగదీసుకునేందుకు మా షాపులో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడన్నారు. ఏమీ తెలియనట్లు షాపు వద్దకు వచ్చి తాను వైసీపీ నాయకుడిని అని, మీ షాపులో దొంగతనం జరిగిందంట కదా పోలీసులతో మాట్లాడి దొంగలను పట్టుకునేలా చేస్తానని నమ్మించాడని వివరించారు. ఫోన్ నంబర్ తీసుకొని బెదిరించి తనను లొంగదీసుకున్నాడని అన్నారు. ఆ తర్వాత నగ్నంగా వీడియోలు, ఫొటోలు తీసి వాటిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరించి ప్రతి రోజూ తన నుంచి నాలుగు వేల రూపాయలు వసూలు చేశాడని వివరించారు. ఆ తర్వాత మనకు మధ్యలో నీ భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయన్ను తప్పించేందుకు విష ప్రయోగం చేయాలంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చాడన్నారు. దీనిలో భాగంగానే ఓబిక్షగాడిని చంపాడన్నారు. వైసీపీ నాయకుడు నాగేశ్వరావు, ఆయన అనుచరులు తమ పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించారన్నారు. వారికి భయపడి మా ముగ్గురు పిల్లలు స్కూలు, కాలేజీలకు వెళ్లడం మానేశారన్నారు. తన భర్తను అనేకసార్లు చంపడానికి ప్రయత్నించాడన్నారు. నిందితుడు నాగేశ్వరరావు ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. నాగేశ్వరరావు, ఆయన అనుచరుల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. తాము ఫిర్యాదుచేసి 20రోజులు దాటినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందన్న ధైర్యంతో బాధిత మహిళ ముందుకొచ్చి పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఎస్పీని, అదేవిధంగా నగరంపాలెం, మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమీక్షలు.. ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

కొన్ని పంచాయతీలను విలీనం చేసి పదేళ్లు దాటిందని, అయితే పరిశుభ్రమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణాలు మంజూరై ఉన్నాయని, అయితే కొన్ని పనులు ప్రారంభించి నిలుపుదల చేశారన్నారు. ఆ పనులను కొనసాగించడమా... అంచనాలను సవరించి కొత్తగా చేపట్టడమా అనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ స్పందించి మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో భాగస్వామ్యమైన మంగళగిరి నియోజకవర్గానికి కూడా మౌలిక సదుపాయాల కల్పన పనులను పొడిగించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు.

సూచనలు.. లక్ష్యాలు

కలెక్టర్ల సదస్సు చివరి రోజున వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్లకు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడున్నర నెలల్లో పీఎంఏవై అర్బన్ కింద 4200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గుంటూరు కలెక్టర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించారు. పీఎంఏవై అర్బన్‌ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం గడవు పొడిగించినందున సాధ్యమైనంత త్వరగా పెండింగ్ గృహాలు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. అటవీ శాఖ క్లియరెన్స్‌లు జిల్లాలో ఏడు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా విస్తరిస్తున్నందున ప్రతీ ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఒక బ్లూ ప్రింట్ తయారు చేసి అమలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్లానింగ్ చేసుకుని ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరిలో ఐటీ పార్కు నిర్మాణానికి 200 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. అమరావతిని బుద్ధిస్టు సర్క్యూట్‌గా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. మానవవనరులు, గృహ నిర్మాణం, చైల్డ్ వెల్ఫేర్, వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఇలా దాదాపు అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాకు సంబంధించి సమీక్షలో చర్చించించారు. రాబోయే నాలుగున్నరేళ్లలో ఆయా రంగాలలో సాధించాల్సిన పురోగతితో పాటు జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉన్న వనరుల లభ్యత వంటి అంశాలన్నీ సదస్సులో చర్చకు వచ్చాయి

ఓఆర్‌ఆర్‌తో గుంటూరు - విజయవాడ - అమరావతి కలిసిపోతాయి

అమరావతి ఔటర్ రింగురోడ్డు డీపీఆర్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఔటర్ రింగురోడ్డు అభివృద్ధితో గుంటూరు, అమరావతి, విజయవాడ, వీటి మధ్య ఉన్న గ్రామాలు కలిసిపోతాయని సీఎం చెప్పారు. దీంతో పట్టణీకరణ పెరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రాధాన్యక్రమంలో పనులను నిర్ణయించి, ఆ దిశగా వాటిని చేపట్టాలని సూచించారు.

వరప్రదాయినికి వీడిన గ్రహణం

సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా నిలిచే గోదావరి జలాల తరలింపు పథకానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. కూటమి ప్రభుత్వం ఈ పథకం నిర్మాణాన్ని పట్టాలెక్కిస్తూ కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మాణాన్ని నిలిపివేసింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణ వ్యయం రూ.6020 కోట్లు కానున్నది. 466 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ పథకం పూర్తి చేస్తే సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు మహర్దశ పడుతుంది. గోదావరి, పెన్నా అనుసంధానం కుడి కాల్వ ఆయకట్టుకు జీవం పోస్తుంది.

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో సంఘ్ ఘన విజయం

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (ఎస్‌సీఆర్ఈఎస్) ఘన విజయం సాధించింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరు డివిజన్ వ్యాప్తంగా జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు గురు వారం ఉదయం పట్టాభిపురంలోని గుంటూరు డీఆర్ఎం కార్యాలయం ఆవర ణలో నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా మొత్తం 4060 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 2036 ఓట్లను సంఘ్, 1660 ఓట్లను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు సాధించాయి. దీంతో 376 ఓట్ల ఆధిక్యంతో ఎంప్లా యీస్ సంఘ్ గెలుపొందినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఫలితాలు వెలువడగానే సంఘ్ నాయకులు విజయోత్సవ ర్యాలీ, గెలుపు సంబరాలను నిర్వహించారు. పరస్పరం మిఠాయిలు పంచుకొని ఆనందోత్సాహంతో సంబరాలు చేశారు. ఈసందర్భంగా సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణ య్య మాట్లాడుతూ రైల్వే కార్మికులు సంఘ్‌కు అండగా నిలిచినందుకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా సంఘ్ ఇచ్చిన హామీల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సాధ్యమైనంత త్వరగా అధికారులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేయించి చర్చిస్తామన్నారు.



రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు విజయోత్సాహం

రిటర్నబుల్ ప్లాట్లకు ఈ- లాటరీ

తుళ్లూరు, డిసెంబరు 12: అమరావతి రాజధాని అమరావతి రైతుల ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ రాజకుమారి తెలియజేశారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ-లాటరీ నిర్వహించారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్సిల్-130, కమరిషయల్ -113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఆఫీసు మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్ జాయింట్ డైరెక్టర్ వీ.డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భీమారావు స్వర్ణమేరి, సాయి శ్రీనివాస్ నాయక్, పద్మావతి, హస్సేన్ సాహెబ్, కె.ఎస్.భాగ్యరేఖ, రవీందర్, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరావు, తహసీల్దార్ అరుణాదేవీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విజయవాడ సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన లాటరీలో రైతులకు ప్లాటు పత్రాలు అందజేస్తున్న అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, డిసెంబరు 12: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావటంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన షేక్ మస్తాన్ వలి 2018వ సంవత్సరంలో పట్టణంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన ఫిర్యాది సీహెచ్ గీతాలక్ష్మి వద్ద రెండు లక్షల 50 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా అదే ఏడాది డిసెంబరు 22న 3లక్షల 50 వేల రూపాయలకు చెక్కు ఇచ్చాడు. గీతాలక్ష్మి సదరు చెక్కును తన బ్యాంక్ ఖాతా లోవసూలుకు వేసుకుంది. అది చెల్లలేదు. ఈ మేరకు ఆమె కోర్టులో కేసు దాఖలు చేసుకుంది. విచారణలో నేరం, రుజువు కావడంతో మూడు నెలలు జైలు శిక్ష రూ.3,50,000 ఫిర్యాదుకు చెల్లించేలా స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి టి.ప్రవళిక గురువారం తీర్పు ఇచ్చారు.



ద్విచక్ర వాహనం అదుపుతప్పి కార్పెంటర్‌కు తీవ్ర గాయాలు

యడ్లపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన కార్పెంటర్ దారా కోటేశ్వరరావు గురువారం మధ్యాహ్నం యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలో జరుగుతున్న బంధువుల వివాహ వేడుకకు కుటుంబ సభ్యులతో కలసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. యడ్లపాడు సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి సర్వీసు రోడ్డు దిగువకు దూసుకుపోయింది. ఈ సంఘటనలో కోటేశ్వరరావు ఎడమ చేయి మోచేతి పైభాగం వరకు తెగి పడగా, భార్య, ఇద్దరి పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనం ప్రారంభం

నరసరావుపేట లీగల్, డిసెంబరు 12: రాష్ట్రీయ బాలల సురక్ష కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ స్థాయిలో పిల్లలను తరలించడానికి కేంద్ర ప్రభుత్వం వాహనాన్ని కేటాయించినట్లు పల్నాడు జిల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ బి రవి గురువారం తెలిపారు. సదరు వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రభుత్వ వైద్యశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రహణమొర్రి, చెవిటి, వినికిడి సమస్యలు కలిగిన పిల్లలను ముందుగా గుర్తింస్తే వారిని శాశ్వత వైకల్యం నుంచి కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ హనుమకుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణానికి రూ.1,00,116 విరాళం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 12: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన పొట్టిమూర్తి జగదీష్, ధర్మపత్ని సుధాలక్ష్మీ, దంపతులు రూ.1,00,116 విలువగల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహంకాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి మాధవీదేవి దాతలకు అందజేశారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

ఈపూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, మేజర్, మైనర్ కాలువలకు సాగునీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడు చెరువులు, 9 కాలువలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్నిగుండాల, బొగ్గరం ఆర్‌పి, ఈపూరు చెరువు, ముప్పాళ్ళ-1, ముప్పాళ్ళ-2, చిట్టాపురం దాసరపాలెం, కొండాయిపాలెం, కొచ్చెర్ల, కొండ్రముట్ల-1, కొండ్రముట్ల-3, సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

చిన్నకంచెర్ల చేపల చెరువు వేలం వాయిదా

చిన్నకంచెర్ల (శావల్యాపురం) డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంచెర్లలోని మేడిచెరువులో చేపల పెంపకానికి సంబంధించిన బహిరంగ వేలంను ఈవోపీఆర్డీ సుగుణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వేలంలో పాల్గొనేందుకు పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వేలంను వాయిదా వేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో వేలంను మరోసారి నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, శ్రీవల్లి పాల్గొన్నారు.

16న వయ్యకల్లు చేపల చెరువు వేలం

వయ్యకల్లు (శావల్యాపురం) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వయ్యకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్-815లోని 25.85 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువులో చేపల పెంపకానికి సంబంధించి బహిరంగ వేలంను ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వరికూటి సైదారెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1434, 1435 ఫసలీలకు వేలం నిర్వహించడం జరుగుతుందని, వేలంలో పాల్గొనదలచినవారు మద్దతు ధరలో పావుభాగం రూ.62వేలు ముందుగా డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంను దక్కించుకొన్నవారు పాట మొత్తం నగదును 15రోజులలోపు చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన వారంతా బహిరంగ వేలంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిథిల భవనంలో డీఎస్‌వో కార్యాలయం



శిథిలావస్థలో జిల్లా సరఫరా అధికారి కార్యాలయ భవనం



కార్యాలయం లోపల పెచ్చులూడి ఊచలు బయటపడిన శ్లాబ్

- శ్లాబ్ పెచ్చులూడి పడి గాయపడుతున్న సిబ్బంది
- బిక్కు బిక్కుమంటూ ఉద్యోగుల విధులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే అధికారులు.. సిబ్బంది హడలిపోతున్నారు. ఎప్పుడు శ్లాబ్ పెచ్చులూడి తలలపై పడుతాయోనన్న భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదకంగా ఉన్న భవనంలో గత్యంతరం లేని దుస్థితిలో వారు నెట్టుకొస్తున్నారు. జిల్లా సరఫరా అధికారి కార్యాలయంను కలెక్టరేట్ సమీపంలోని శిథిల భవనంలో ఏర్పాటు చేశారు. భవనం కూలేస్థితికి చేరింది. అయినా ఆ భవనంలో తప్పక విధులు నిర్వహిస్తున్నారు. శ్లాబ్ పెచ్చులూడి తలలపై పడుతున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న భవనం నుంచి కార్యాలయాన్ని వేరొక భవనంలోకి మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ దిశగా అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులో వినతుల వెల్లువ

వినుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టంబండ సచివాలయంలో రెవెన్యూ అధికారులు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఉమ్మడివరం, చెట్టుపల్లి గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని డిప్యూటీ తహసీల్దార్ మురళికి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. గతంలో రీ సర్వే కారణంగా కొన్ని సమస్యలు పరిష్కరించినప్పటికీ భూ ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, గ్రామ సర్పంచ్ వీరగంధం ఆనంద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్రాంతిపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఏవీ రమణ

సంక్రాంతిపాడులో రెవెన్యూ సదస్సు

నాదెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపాడులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మిలు గ్రామస్థుల నుంచి 20అర్జీలు స్వీకరించారు. మ్యుటేషన్ కోసం నాలుగు, విస్తీర్ణంలో తేడాలపై, సబ్ డివిజన్ కోసం మరో 16 దరఖాస్తులను అందించారు. కార్యక్రమంలో వీఆర్‌వో నాగ జ్యోతి తదితరులు ఉన్నారు.

నూజెండ్ల మండలంలో...

నూజెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూముల ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించటం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి తక్షణం చేయగలిగిన పరిష్కారాలను తహసీల్దార్ రమేష్ కుమార్ పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, టీడీపీ నాయకులు గంగినేని ఆంజనేయులు, గంగినేని బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి: ఎంపీడీవో

శావల్యాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం కూడా శిక్షణ తరగతులు కొనసాగాయి. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించడం, అభివృద్ధి పథకాలను కొనసాగించడం, వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. విద్య ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం, గ్రామపాలన తదితర అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. గ్రామీణప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేసి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



శావల్యాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

నూజెండ్లలో...

నూజెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సుస్థిర అభివృద్ధిపై మూడురోజు శిక్షణ కార్యక్రమాలను ఎంపీడీవో పీ ఉమాదేవి నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో అధికారులు, సిబ్బంది పాత్ర ముఖ్యమైనదన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించటం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి, గ్రామ పరిపాలనపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో మాధ్యూబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి గురించి, చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమం శుక్రవారం కూడా జరగనుంది.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించే వాహనాలకు తాళాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రధాన రహదారులపై రోజులు తరబడి నిలిపివేసిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశించడంతో ఎట్టకేలకు పట్టణ సీఐ శోబనబాబు స్పందించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన కాల్వ కట్టపై రోజుల తరబడి నిలిపివేసిన వాహనాలకు ఆయన తాళాలువేశారు. వాహనాలు నిలిపివేయడం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, ఎవరైనా రోడ్లపై వాహనాలు నిలిపివేసి వెళితే వారి వాహనాలకు లాకులు వేయడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్‌లో గత కొంతకాలంగా గుర్తుతెలియని ఆకతాయిలు అల్లర్లకు పాల్పడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ సత్యనారాయణతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో ఎవరైనా ఆకతాకయిలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రతి రోజు బస్టాండ్ ఆవరణలో ఉదయం సాయంత్రం ఇద్దరు కానిస్టేబుల్స్‌ను నియమించి ఆకతాయిల ఆట కట్టించేలా చర్యలు చేపడుతున్నారు.



కాల్వ కట్టపై రోజుల తరబడి నిలిపివేసిన వాహనాలకు తాళాలు వేస్తున్న పోలీసులు

నిర్వహణ లోపం.. నిలిచిన కొంకేరు ఎత్తిపోతల పథకం

- ఈ పథకంతో వెయ్యి ఎకరాలకు లబ్ధి

వినుకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టంబండ రైతులు కోసం గతంలో ఏర్పాటుచేసిన కొంకేరు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధికారులు పథకంవైపు కన్నెత్తి చూడకపోవడంతో విలువైన హైపవర్ మోటార్లు దొంగలపాలై పథకం మూలన పడింది. రైతుల్లో నెలకొన్న అనైతికత, రాజకీయాలు కారణంగా రైతులు ఎవరికి వారు యమునాతీరు అన్నట్లు వ్యవహరించడంతో పథకం షట్టర్లు ఎత్తిన దాఖలాలు లేవు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకం మూలన పడడంతో పంట పొలాలన్నీ బీడుబారాయి. స్తోమత కలిగిన రైతులు పొలాలను బీడు పెట్టలేక కొందరు రైతులు సుబాబులు, జామాయిల్ వంటి పంటలను వేసుకొని కాలం గడుపుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి కొంకేరు ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపట్టి పథకంను పునరుద్ధరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పిచ్చిచెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న కొంకేరు ఎత్తిపోతల పథకం

గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి: ఎన్‌టీఏ

వినుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు బోధన కుంటుపడకుండా చూడాలంటూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ నవంబరు 13వ తేదీ నుంచి 29 రోజులుగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సమ్మెలో ఉన్నట్లు ఆయన తెలిపారు. దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 199 గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడిందని వీరిలో అధికశాతం 2016 నుంచి 2019, 2007 నుంచి మూడు విభాగాలుగా గిరిజన సంక్షేమ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారని, వీరి న్యాయమైన డిమాండ్లను జీతాలు పెంపుదల కాంట్రాక్టు రెసిడెన్షియల్ బేసిక్‌గా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖామాత్యులు సంధ్యారాణి చొరవచూపి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోనూరు సాంబశివరావు, ఎంఎస్‌రావు, వసంతరావు, చంద్రశేఖర్, ఊటుకూరి శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు. గురువరం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆయా శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.



శివాపురం - నడిగడ్డ రహదారిపై నిలిచిపోతున్న నీరు

వినుకొండటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాపురం నుంచి నడిగడ్డ వెళ్ళే ప్రధాన రహదారిపై శివాపురం చెరువు సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 10రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచాయి. అంతేకాకుండా చప్టాపై గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. అధికారులు స్పందించి నీటిని మరలించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నడిగడ్డ వాసులు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలను వమ్ముచేస్తూ వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఆరు నెలల కాలంలో సమకూర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖపట్నంలో రైల్వేజోన్ వస్తుందో రాదో కూడా చెప్పలేని దుస్థితి ఏర్పడిందన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కూడా ఇక్కడే ఉండేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాజకీయ కక్షలు, కార్పణ్యాలతోనే గడిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేసి రైతులకు భరోసా కల్పించారని తెలిపారు. సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రోడ్లకోసం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. నేడు రాష్ట్రానికి వచ్చేందుకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా ఉంటాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టి కిరణ్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, పల్నాడు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు వీ కోటనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సాయం

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మానవతా దృక్పథంతో కూటమి ప్రభుత్వ సాయం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడించారు. గురువారం ఉదయం తన నివాసంలో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 26 మంది లబ్ధిదారులకు రూ.24,24,443 విలువ కలిగిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సంబంధిత సమస్యలతో ఆస్పత్రుల్లో చేరి బిల్లులు చెల్లించలేని నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి సహాయనిధి లక్ష్యం అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీరహితంగా ప్రతి ఒక్కరికి అమలు చేసేందుకు తాను కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

బాస్కెట్‌బాల్ పోటీలలో...

ధనలక్ష్మీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

ఈపూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థినులు బాస్కెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కామర్స్ లా కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల పోటీలలో ఐ తిరుపతమ్మ, వీ వెంకటలక్ష్మిలు పాల్గొని విజయం సాధించి ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. డిసెంబరు 20వ తేదీ నుంచి ఎంజీ యూనివర్సిటీ కొట్టాయంలో జరిగే దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, సీహెచ్ అరవింద్, ఎం.దాసు, కే వంశీ అభినందించారు.



తిరుపతమ్మ, వెంకటలక్ష్మి

ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి

- ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు

ఈపూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయంగా ఉన్న పదో తరగతి ప్రణాళికను రద్దుచేసి ఉపాధ్యాయులకు పూర్తిస్వేచ్ఛ ఇవ్వాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బి.వెంకటనాగేశ్వరరావు అన్నారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో గురువారం ఈపూరు హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పేరుకుపోయిన బకాయిలను ఉపాధ్యాయులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎన్‌టీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, ఎంఎస్‌రావు, కార్యవర్గ సభ్యులు వి.శ్రీకృష్ణ, చంద్రశేఖర్, హెచ్ఎం రామకృష్ణారెడ్డి, జీసీడీఏ రేవతి పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సెమీ క్రిస్మస్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంఘం భవనంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభకు సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, కార్యదర్శి సీసీ ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, రాజేశ్వరరావు, మధవరెడ్డి, డానియేల్ తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ గీతాలను షీలా ఎడ్విన్, పచ్చల నాగభూషణం, యేసుదాసు, శారదా, ఆలపించారు. డాక్టర్ కెఎం విక్టర్‌ను సన్మానించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, అనంతరం ప్రేమవిందు నిర్వహించారు.

నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ల విడుదల

చిలకలూరిపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని మేజర్, మైనర్ నీటి సంఘాలకు ఎన్నికల అధికారులు నోటిఫికేషన్లు గురువారం విడుదల చేశారు. యడవల్లి, యల్లమంద, కావూరు, పురుషోత్తపట్నం మేజర్ సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్లను ఇచ్చినట్టు ఎన్నికల అధికారి ఏఈ రాములు నాయక్ తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాలు, పాఠశాలలలో ఓటర్లకు అందుబాటులో నోటిఫికేషన్లు ఉంచామన్నారు. ఈ నెల 14న ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.

287 పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

చిలకలూరిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో గుంటూరు డాక్టర్ అగర్వాల్ ఐ కేర్ హాస్పిటల్ వారు చిలకలూరిపేట పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు గురువారం కంటి వైద్య శిబిరం ఇక్కడ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 287మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ టి వెంకటేశ్వర్లు, డాక్టర్ వంశీక్రిష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణారావు, సునీత పాల్గొన్నారు.

బాల సాహిత్య పుస్తకాల పంపిణీ

చిలకలూరిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవలు అందించిన బ్రిటిష్ ఉద్యోగి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక శ్రీశారద మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని గ్రంథాలయానికి గార్డ్స్ సేవా సంస్థ వారు బాల సాహిత్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం జనవిజ్ఞాన వేదిక ప్రత్యేకంగా రూపొందించిన 40 రకాల బాల సాహిత్య పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి ఉచితంగా అందచేశారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, గార్డ్స్ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, సభ్యులు వడ్లాని చంద్రం, పొనుగుబాటి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

నాదెండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని తులసీ వనం వృద్ధాశ్రమంలో వృద్ధులకు బీజేపీ నేతలు గురువారం అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లయ్య, లక్ష్మణ్, సుభానీ, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.